క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేస్తున్న తానిపర్తి శేషిరెడ్డి

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మంగమూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తానిపర్తి శేషిరెడ్డి నోట్‌పుస్తకాలు, పెన్నులు, స్నాక్స్‌ను పంపిణీ చేశారు. శేషిరెడ్డి తండ్రి పిచ్చిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

శివం ఫౌండేషన్ ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న శివం ఫౌండేషన్ శ్రీహరి

ఒంగోలు: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై బాధపడుతున్న దాట్ల మాణిక్యాలరావుకు శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన దాట్ల మాణిక్యాలరావు పెయింటర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రెండు నెలల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై కాలు, చేయి చచ్చుబడి మంచానికే పరిమితమయ్యాడు. అతని పరిస్థితి తెలుసుకున్న శివం ఫౌండేషన్ రూ.25 వేల ఆర్థికసాయం అందజేసింది. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు చేతులమీదుగా ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో బొంతు దశరథరామయ్య, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెనగమూరు వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన గొట్టం వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు వెంకట్రావు, మనవడు గణేష్, మనుమరాలు లక్ష్మిలతో కలిసి తన ద్విచక్రవాహనంపై బంధువుల పిలుపు మేరకు దర్శి తిరునాళ్లకు వెళ్తున్నారు. మండలంలోని పెనగూమరు వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. వెంకట్రావు తలకు గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు కాలు విరిగింది. అదృష్టవశాత్తు చిన్నారులకు ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



తోకపల్లెలో నూతనంగా ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం

పెద్దారవీడు: మండలంలో తోకపల్లె గ్రామంలో లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ, విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం సాయంత్రం అర్చకులు పెరుగువల్లి సుబ్రమణ్యంశర్మ, పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. శుక్రవారం ఉదయం 8.17 గంటలకు యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ, ఆలయ విమాన శిఖర ప్రతిష్ఠ, స్వామి ప్రథమ దర్శనం, దృష్టి కుంభం పూజలు తదనంతరం సీతారామచంద్రస్వామి శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు వివరించారు. అన్నదానంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

యువకుల ఘర్షణ..కత్తితో దాడి

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్లో ఉన్న ఒక బార్ అండ్ రెస్టారెంట్లో ముగ్గురు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు కలిసి ఒకడిని కత్తితో పొడిచారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. పట్టణంలోని ఎన్‌ఎస్ నగర్లో నివాసం ఉండే నాగరాజు పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన మరో ఇద్దరు కలిసి బార్ అండ్ రెస్టారెంట్లో మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో వారి మధ్య ఒక విషయంపై వాగ్వాదం జరిగింది. దీంతో సుంకేసుల గ్రామానికి చెందిన ఆ యువకులు నాగరాజుపై కత్తితో దాడి చేయడంతో స్థానికులు గుర్తించి చికిత్స కోసం జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఓటమి భయంతో దిగజారుడు రాజకీయం

- రౌడీయిజం చేస్తూ హీరోయిజం అనుకుంటే భ్రమే
- ఎస్సీ, బీసీల పట్ల చులకనగా వ్యవహరిస్తే సరైన గుణపాఠం చెబుతాం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర

ఒంగోలు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి భయంతో కార్యకర్తలను రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా చంద్రబాబు వద్ద మెప్పు పొందేందుకు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ యత్నించి దిగజారుడు రాజకీయానికి పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆది నుంచి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకుల్లో రెచ్చగొట్టే విధానమే కనిపించిందన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు సమాయత్తమవుతున్న వేళ తొడలు కొట్టడం, మీసాలు మెలేయడం ఎక్కడి సంస్కృతని ప్రశ్నించారు. కార్యాలయంలో కూర్చొని రౌడీయిజం చేస్తూ హీరోయిజంగా భ్రమిస్తే 2024 ఎన్నికల్లో మరోమారు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ మాట్లాడుతూ మనిషికి సంస్కారం ముఖ్యమన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన బాలినేనిని పట్టుకుని ఏకవచనంతో సంబోధించడంలోనే మీ వ్యక్తిత్వం ఏమిటో అర్థమవుతుందన్నారు. తాము బాలినేని కారులో ఉన్నట్లు గానీ, తమ వద్ద కారంపొడి ప్యాకెట్లు ఉన్నట్లు గానీ నిరూపించాలని దామచర్లకు సవాల్ విసురుతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జిలకర పున్నయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసింది చాలక, రౌడీలను రంగంలోకి దింపి ఉద్రిక్తతలు సృష్టించిన విషయం ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, మరోమారు మీకు గుణపాఠం తప్పదన్నారు. తమను విమర్శించేముందు బ్యాంకులకు రూ.30కోట్లు ఎందుకు ఎగ్గొట్టావో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీసీ నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ బీసీ మహిళ అయిన నక్కా లీలాకుమారి పట్ల కాకర్ల ఈశ్వర్ తదితరులు వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. ఓటమి భయంతో పథకం ప్రకారం ఉద్రిక్తతలు సృష్టించిన దామచర్లకు మరోమారు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ



మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్‌లెట్లు మింగిస్తున్న ఆసుపత్రి డాక్టర్ మానసతో తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఇతర వైద్య సిబ్బంది ప్రధానోపాధ్యాయుడు

మద్దిపాడు: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులు చక్కగా సాగుతాయని మద్దిపాడు తహశీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు పని చేస్తాయని, పొట్టలో ఉండే నులిపురుగులను చంపి శరీరం ఎదుగుదలకు ఉపయోగపడుతాయన్నారు. డాక్టర్ మానస మాట్లాడుతూ 2 సంవత్సరాల్లోపు చిన్నారులకు అర ట్యాబ్లెట్, 2 నుంచి 19 సంవత్సరాలలోపు వారికి ఒక ట్యాబ్లెట్ వేయాలని అన్నారు. ట్యాబ్లెట్‌లు నమిలి మింగాలని సూచించారు. మండలంలో మొత్తం 9036 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించారని, మంగళవారం 8133 మందికి ట్యాబ్లెట్లు వాడామని మిగిలిన 10 శాతం మందికి ఈనెల 18వ తేదీ శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మింగించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అంగన్‌వాడీ సెంటర్లలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వారి వెంట ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ జూనియర్ డాక్టర్‌లు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను రక్తహీనత నుంచి కాపాడుదాం

నాగులుప్పలపాడు: పిల్లల్లో రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారిస్తే చాలా వరకు అనారోగ్య సమస్యలు తగ్గించవచ్చని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఎంపీపీ మాట్లాడుతూ రక్తహీనత వంటి వ్యాధుల నుంచి కాపాడటానికి వైద్య ఆరోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. వైద్యులు ఓనారియేల్ మాట్లాడుతూ ఏడాది వయస్సున్న పిల్లల నుంచి 19 ఏళ్ల వయస్సున్న వారికి ఆల్బెండజోల్ మందులు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం నాగులుప్పలపాడు కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.వి.కుమారి, ఏపీఎం ధనుంజయ్, ఏపీఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు బుచ్చిబాబు, శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తపట్నం: సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగుల నివారణ మందు ఉపయోగపడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారులు శివపార్వతి, వైష్ణవి అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రెండు పీహెచ్‌సీల పరిధిలో 11,541 మందికి లక్ష్యంగా పెట్టుకోగా 10,585 మందికి మాత్రలు వేశామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఓంకార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని యరజర్ల యూపీ స్కూలులో, మండల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్ వాణి విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ ఎదిగే వయసులో చిన్నారుల్లో ఈ నులి పురుగులు తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. కరవది హైస్కూలులో ఎస్ఎస్. జ్యోతి, ఎంపీహెచ్‌ఈఓ శివప్రసాద్, ఏఎన్ఎంలు సరిత, సుబ్బమ్మ, కృష్ణవేణి నిర్వహించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు



యరజర్ల యూపీ స్కూలులో మాత్రలు మింగిస్తున్న డాక్టర్ ఎస్ వాణి



ఈతముక్కలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న సిబ్బంది

నిఘా నేత్రాల మధ్య ఇంటర్మీడియెట్ పరీక్షలు

మద్దిపాడు: మండలంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 15 వ తేదీ నుండి 29వ తేదీ వరకూ ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర పరీక్షలు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ టీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలకు చెందిన 88 మంది, రాఘవ ఒకేషనల్ కళాశాలకు చెందిన 110 మంది పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ రెండో సంవత్సరం కళాశాల విద్యార్థులు 87 మంది, ఒకేషనల్ కళాశాలకు చెందిన 51 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలకు వచ్చే విద్యార్థులు గం .8.45 నిముషాలకు పరీక్ష హాలులో ప్రవేశించాలని 9 గంటల తరువాత ఒక్క నిముషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష రాయడానికి అనుమతించబోమని తెలిపారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు కళాశాల ప్రాంగణంలోనికి సెల్‌ఫోన్‌లు తీసుకు రాకూడదని చెప్పారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ పరీక్ష జరిగే సమయంలో 144 సెక్షన్ విధించారని, ఆ సమయంలో కళాశాల చుట్టు పక్కల గుంపులుగా నిలవడం చేయరాదని, జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.



ఉప్పుగుండూరు జూనియర్ కళాశాల

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

నాగులుప్పలపాడు: ఇంటర్ బోర్డు పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు తెలిపారు. ఉప్పుగుండూరు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది 240 మంది, సెకండియర్ నుంచి 235 మంది మొత్తం 475 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని విద్యార్థులు తప్పకుండా అర్ధగంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు.

భూముల సర్వేను పరిశీలించిన డీపీఓ

మద్దిపాడు: మండలంలోని నందిపాడు గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో జరుగుతున్న సర్వేను మంగళవారం డీపీఓ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గృహ యజమానులతో మాట్లాడుతూ యజమానులు తమ గృహాల కొలతలను దగ్గర ఉండి తీయించుకోవాలని అన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా గ్రామ కంఠాల్లో నివసిస్తున్న వారికి ఎటువంటి పట్టాలు ఉండవని, అటువంటి వారు తమ నివాసం ఉంటున్న స్థలాన్ని సర్వే చేయించుకుంటే రాబోవు రోజుల్లో వారికి హక్కు పత్రాలు ఇస్తారని తెలిపారు. అదేవిధంగా స్వంత పొలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు కూడా కొలతలు వేయించుకుంటే వారికి నివాస గృహం కింద నమోదు చేస్తారని, దీని వలన ముందు ముందు ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. గ్రామంలో ప్రతి స్థలాన్ని సర్వేలో కొలతలు వేస్తారని అందు వలన ఇళ్ల యజమానుల మధ్య భూతగాదాలు ఉండవన్నారు. సర్వేను ఏవిధంగా పూర్తి చేశారన్న విషయాలను సర్వేయర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, సర్పంచ్ మద్దినేని అరుణ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



నందిపాడులో నివాస గృహాలను పరిశీలిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

యూనివర్శిటీ ఏర్పాటుపై పార్లమెంట్‌లో మాగుంట ప్రశ్న

ఒంగోలు: ఏపీలో ప్లానింగ్, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ స్థాపనపై పార్లమెంట్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నలేవనెత్తారు. ఏపీ, ఇతర రాష్ట్రాలలో అవకాశాలు బాగా పెరుగుతున్న దృష్ట్యా ప్రణాళిక, నిర్మాణ రంగాలకు సంబంధించి జాతీయ కళాశాలల ఏర్పాటు గురించి, నిర్మాణ రంగాలకు సంబంధించి జాతీయ కళాశాలల ఏర్పాటు, మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వ చర్యల గురించి వివరించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ సమాధానం ఇస్తూ 2018-19 బడ్జెట్‌లో దేశంలో రెండు పూర్తి స్థాయి ప్లానింగ్, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీల ఏర్పాటుకు , 18 నూతన ప్లానింగ్-ఆర్కిటెక్చర్ శాఖలను బాగా స్థిరపడిన ఐఐటీ , నిట్ కాలేజీలలో ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు. కోవిడ్ కారణంగా 2020-21లో వీటి ఏర్పాటుకు ఆర్థిక ఖర్చుల శాఖ అంగీకరించడం జరగలేదన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వీటి ఏర్పాటుకు నిర్ణయించి పతిపాదనలను తిరిగి అంచనావేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దేశంలో పూర్తి సమర్థతతో 5 నూతన కేంద్రాలను భిన్న ప్రాంతాలలోని ప్రస్తుత విద్యా సంస్థలలో ఏర్పాటుకు 2022-23 బడ్జెట్లో ప్రకటించామని, కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ ఈ ప్రాజెక్టును నడిపిస్తుందన్నారు

వెలుగొండ తిరునాళ్ల రేపు

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం కొనకనమిట్ల మండలం వెలుగొండలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు వెలుగొండ క్షేత్రం ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి మొదలు బహుళ ఏకాదశి వరకు బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. నేడు బుధవారం గరుడోత్సవం , గురువారం గజోత్సవం తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. శుక్రవారం రథోత్సవం జరగనుంది. తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచే కాక, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో బ్రహ్మోత్సవాలకు వచ్చి దేవుని దర్శనం చేసుకుంటారు.

తాడి వారి మర్యాద

తాడివారి మర్యాద అంటే రాచ మర్యాద కాదు..అప్పట్లో శ్రీవారు చెంచులక్ష్మిని వివాహం చేసుకున్నప్పుడు లక్ష్మీదేవి బంధువులు అయిన తాడివారిపల్లి వాసులు కత్తులు, కటార్లతో స్వామివారిపై దాడి చేశారని పురాణాల్లో ఉంది. ఇదే తాడివారి మర్యాద అంటే. ఈ సంప్రదాయం ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో కొనసాగుతోంది. తాడివారిపల్లి వాసులు ఆయుధాలతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కత్తులు, కటార్లతో ఉత్సవం చేయటం ఆనవాయితీ.

దేవస్థానానికి వెళ్లే రూటు

పొదిలి నుంచి మార్కాపురం వెళ్లే దారిలో నాగిరెడ్డిపల్లి స్టేజి నుంచి నాలుగు కిలోమీటర్లు దక్షిణం వైపుగా ప్రయాణిస్తే పుణ్యక్షేత్రం వస్తుంది. అలాగే పొదిలి-గిద్దలూరు రహదారి గొట్లగట్టు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో వెలుగొండ చేరుకోవచ్చు. మూడు రోజులపాటు పొదిలి, మార్కాపురం, కనిగిరి డిపోల వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

కారుణ్య నియామకపత్రం అందజేత



కారుణ్య నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. 2011లో ఆర్టీసీలో అదనపు డిపో క్లర్కుగా విధులు నిర్వహిస్తూ ఎం కృష్ణమూర్తి మరణించారు. ఆయన కుమార్తె ఎంవీ సుజాతారాణికి మద్దిపాడు మండలంలోని మద్దిపాడు గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా ఎస్పీ మలికాగర్గ్ కారుణ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసు విధులు, ఉద్యోగ విధి విధానాలపై అవగాహన పెంచుకుని విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, ఇతర విషయాలకు సంబంధించి సమాచార సేకరణలో కీలకంగా వ్యవహరించాలన్నారు. అంకితభావంతో కష్టపడి పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి ఎం సులోచన , యు.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

బాలినేనికి బొట్ల సోదరుల కృతజ్ఞతలు



బాలినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న బొట్ల సోదరులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావులు మంగళవారం ఆయన నివాసంలో కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా బొట్ల రామారావు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జిగా బొట్ల సుబ్బారావులను నియమించారు. ఈ నేపథ్యంలో వారు బాలినేనిని కలుసుకుని సత్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. బీసీలను చైతన్య పరచడం, జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణ, సొసైటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి రమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మట్టే రాఘవ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జంకె వెంకటరెడ్డికి కృతజ్ఞతలు



జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డితో దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల మండల కమిటీలు, గ్రామ కమిటీల విధివిధానాలపై కొద్దిసేపు చర్చించారు. పార్టీ నాయకులు అందరినీ సమన్వయం చేసుకుంటూ త్వరలోనే అన్ని కమిటీలను పూర్తి చేస్తామని జిల్లా అధ్యక్షునికి వివరించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి జి.అర్చనను కలిసి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చెయిర్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, ఇతర పరికరాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. లేకుంటే ఆ పరికరాలు పాడైపోయే పరిస్థితి ఉందంటూ విజ్ఞప్తి చేశారు.

రూ.10 లక్షలతో డంపింగ్‌యార్డుకు మరమ్మతులు



కరవదిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద డీఎల్‌పీఓ

ఒంగోలు రూరల్: మండల పరిధిలోని కరవదిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయనున్నట్లు డీఎల్‌పీఓ పద్మ తెలిపారు. రూ.5 లక్షలతో హెడ్ మరమ్మతులు, రూ.5 లక్షలతో ఫెన్సింగ్, వర్మీకంపోకస్టు, గుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. మార్చి 31 నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కరవదిలో ఇప్పటి వరకు 60 శాతం పన్నులు వసూలైందన్నారు.